# జై తెలంగాణ !

# జై ఆంధ్రా ! !

— కాంచనపల్లి

బస్‌స్టాండు కిరుపైపులా అగ్నిహోత్రుడు వీర విహారం చేస్తున్నాడు? దుకాణాల ముందరి తెరలు కాలిబట్టకమరు వాసనను విశ్వవ్యాప్తం చేస్తున్నాడు వాయుదేవుడు ఆ మంటల్లో శివాలు దొక్కుతున్న మనుషులు శివరాత్రినాటి అగ్నిగుండాలను మరిపిస్తున్నారు. పీర్ల పండుగనాటి అగ్ని గుండాలు దొక్కే దృశ్యాలను జ్ఞాపకం చేస్తున్నారు.

యెవడి చేతికి దొరికింది వాళ్ళు గుద్దా పెద్దా యెత్తుకెళుతున్నారు. వల్లబజార్లో తప్ప దొరకని పంచదార వగయిరా బజార్ల పాలుచేశారు. కిర్సనాయిలు రోడ్లమీద ప్రవహింప జేస్తున్నారు. బియ్యం బస్తాలకు బస్తాలు బజార్ల పాలుజేశారు. డబ్బిచ్చే వాడులేడు. పుచ్చుకునే వాడులేడు. సరుకిచ్చే వాడులేడు. పెద్ద దుకాణాలేమిటి? బళ్ళమీద వ్యాపారంచేసి పొట్ట బోసుకునేవారుకూడా ఇదే దుస్థితి పాలయ్యారు. తలుపులేసుకోవడానికి ఆస్తి కాపాడుకోవడానికీ వాళ్ళకాస్కారంలేదు. చిన్న వ్యాపారస్తులు లబో దిబో యంటున్నారు.

పట్టణ పెద్దల సమక్షంలోనే యిదంతా జరుగుతున్నది. ఒక్కడూ కిమ్మన్న పాపానపోలేదు. యెదుటి ముఠా దుకాణాల దోపిడీ అవుతోందన్న సంతోషం వాళ్ళ గ్రూపు వాళ్ళ దుకాణాల దోపిడీతో ఆ సంతోషం క్షణ భంగురమై పోయింది. అంతా మాత్రం జై తెలంగాణా జై ఆంధ్రా అని నినాదాలిస్తున్నారు. హోటళ్ళ అల్మారీల్లో తినుబండారాలు అల్మారీ అద్దాలతోపాటు సఫా అయిపోయాయి. తిన్నవాడు బిల్లు ఇవ్వకపోతే పూర్కోడానికి అలవాటుపడ్డ హోటలువాళ్ళు దిగాలుపడి చూస్తున్నారు.

ఈ బీభత్సానికి ఒకదేమిటి పక్షపాతం లేకుండా అందరూ గురి అయ్యారు.

ఈసారి మా టవున్‌లో గొడవలేమీ వుండవేమోననుకున్నారు. యెందుకంటే తూర్పు ప్రాంతానికి పూనకం వచ్చినంతగా పడమటిప్రాంతానికి రగంరాలేదు. యెంత గుగ్గిలం, సాంబ్రాణి పొగవేసినా వూపురావడం లేదు. వూగి, వూగి శాంతించింది. వేర్పాటు ఉద్యమం పుణ్యమా అని మా చదువు పాడయిందని విద్యార్థులు ముందుకు రావడంలేదు. వాళ్ళను కదిలిస్తే కదిచినంత పని జరుగుతున్నది. కేవలం జీతానికే ఉద్యోగం జెయడం లేదు గనక ప్రభుత్వోద్యోగులకేం లక్ష్యంలేదు. జీతం నష్టమైనా పర్వాలేదు త్యాగాలు చేయగలరు. వాళ్ళే కొద్దిగానో, గొప్పగానో వూపులోకి వస్తున్నారు. ప్రైవేటు ఆస్తి అంత పవిత్రమైనదికాదు. పబ్లిక్ ఆస్తి నష్టమైనా పోయేదేంలేదు. ఫలితం యేమైనా యేదో యింత రాకపోతుందనుకొనే వీల్లేదు. అలాంటి లాభాల్లో ప్రధానమయింది. కొందరు ఎం. పి. లు ఎం. ఎల్. ఏ. లతోబాటే మా జిల్లాకో మంత్రిగారు పుట్టుకరావడం జరిగింది. ఆయనగారి సన్నిధి స్వాములు ఆర్థికంగానే గాక అన్ని విధాలా పెరగడం జరిగింది. నాలుగు బస్సులు తగలబెట్టిస్తే మనకో మంత్రి పదవి దక్కేది. అమాంతం పది సంవత్సరాల వెనకబడిపోయామని మంత్రిగారి ప్రత్యర్థివర్గం చేతులు పిసుకుతున్నది.

సాయంత్రం టీ దాగడానికి బస్స్టాండు హోటల్ కెళ్ళినప్పుడేమీ లేవుకాని తెల్లారేసరికి నాలుగైదు నిరాహారదీక్ష శిబిరాలు మొలుచు కొచ్చాయి. వాటిపైన మూడురంగుల జండాలు, పసుపు పచ్చరంగు జండాలు, సూర్యోదయం జండాలు వగయిరా రెపరెపలాడు తున్నాయి.

షామియానాల్లో జంపఖానాలూ, కుర్చీలూ, నీళ్ళకుండలూ అమ రించి వున్నాయి. నిరాహార దీక్షావ్రతులతో కుర్చీలు కులుకుతూవున్నాయి. వాళ్ళమెళ్ళో పూలదండలు మెరుస్తున్నాయి.

వెంకటేశ్వర్లుగారు అంతటా తానుగా అంతటా తిరుగుతూ వున్నాడు. హడావిడి చేస్తున్నాడు. అన్ని పార్టీల క్యాంపుల వాళ్లకు అన్ని హంగులూ అమరిస్తున్నాడు, డబ్బూ దస్కం సర్దుబాటు చేస్తున్నాడు. యూనియన్ సెక్రేటరీల తలదన్నేట్టు పనిచేస్తున్నాడు. వెంకటేశ్వర్లు సమ్మెలో పాల్గొంటున్నాడంటేనే అందరికీ ఆశ్చర్యంగావుంది. కరువు భత్యం కోసమని ఆంధ్రా తెలంగాణావాళ్ళు కలిసిసమ్మెచేసినప్పుడే వులక లేదు పలకలేదు. తన్నులు తింటే తిన్నాడుగాని లాయల్టీ ఇంక్రిమెంటుతో బాటు ప్రమోషన్కూడా కొట్టేశాడు. ఉద్యోగంలోనికి రాకముందే రాజ కీయ నాయకులు పక్కల్లో రెక్కల్లో మెలిగాడు. అన్ని రకాల అనుభవాలు గడించాడు. దూరదృష్టితో ఈసారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో దూకాడు-ప్రభుత్వమంటే ప్రభుత్వోద్యోగులు-ప్రభుత్వం ప్రజలకు ప్రాతి నిధ్యం వహిస్తుంటే మనం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాం. అందుకోసం మనం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టే లెక్క అని చదివి మరిచిపోని ఈ క్యేషన్నుద్వారా రుజువు చేయగల్గిన ఘటం. రెండు ప్రాంతాల ప్రభుత్వోద్యోగులు వేర్పాటు గోర్తున్నారంటే ప్రజలంతా కోర్తున్నట్టే లెక్క. 1969 లో అలాకాదు ౧ అవునంటే ౧ కాదన్నారు. ఇప్పుడు ౧ + ౧ కోరితుంటే మియాబీబీ రాజీతో క్యాకరే ఖాజీ" సెంటరు దబ్బినట్లు వొప్పుకొని తీరుతుంది. మనవాళ్ళ రాజ్యం వచ్చి తీరుతుంది.

సమ్మెరోజుల జీతం, బోనస్ అన్నీ దొరికినట్టే లెక్క. అని వెనక పట్టు బట్టేవాళ్ళందరినీ కూడగట్టుకొచ్చాడు. కొందరు విద్యార్థుల సాయంతో కలిసిరాని ఉద్యోగులను ఊళ్ళోనుంచి తరిమేయించాడు. అలా పోని మొండిఘటం యెవరైనా వుంటే వాని పూర్వజన్మ కర్మప్రకారం పెట్రోలు మంటల కాహుతయ్యాడు. దీని బాధ్యత వెంకటేశ్వర్లుగారిమీద వున్నదని కళ్లూ, చెవులూ వున్నవాడెవడూ అనలేదు. ఇలా బొందితో కైలాసం పంపడం యే ఒక ప్రాంతానికో పరిమితం కాక అంతటా ఈ పుణ్యకార్యం జరుగుతూ వున్నది. కనుక ఎవరూ యేమీ అనడంలేదు. అంతా గప్‌చిప్‌గా జరిగిపోతూ వున్నది. పోయిన రాజ్యాల్ని జయించిన వీరుడిలా విజయ విహారం సాగిస్తున్నాడు. ఎత్తిన కత్తిని దింపని వీరుడిలా వెలిగిపోతున్నాడు. అందుకే ప్రత్యేక రాష్ట్ర పోరాటమంతా ప్రభుత్వోద్యోగులు అందులో ముఖ్యంగా వెంకటేశ్వర్లుగారు తమ భుజాలమీద వేసుకొన్నారు. తన చాకచక్యంతో నానా గోత్రీకులైన పార్టీల వాళ్ళందరినీ సమైక్యం చేశాడు. లాయర్లను, డాక్టర్లను, దేశం ఒక్కటైనా, ముక్కలైనా వాళ్ళకేం నష్టంలేదు కనక, వీళ్లకూడా చదువుకున్నప్రజలే కనక అందరినీ ఒక తాటిమీదికి తెచ్చాడు. ఎప్పుడూ కుంభకర్ణ నిద్రలో వుండే లాయర్ల, డాక్టర్ల సంఘాలుకూడా తీర్మానాలు చేశాయి.

శిబిరాల్లో లాయర్లు పత్రికలు తెచ్చి పడేశారు. డాక్టర్లు నిరాహార దీక్షా పోరాటం ఆయుధాలైన నిమ్మకాయలు, యెనీమా గొట్టాలు తెచ్చి పడేశారు.

"వచ్చే మున్సిపల్ ఎన్నికలకు యిప్పటినుంచే పెట్టుబడి పెట్టునాష్రోయ్" అన్నాడు ఒక గొట్టాంప్యాంటు నిరాహారి. అతని తొడ గిల్లి నోర్మూయించాడు కిష్టయ్యగారు. మాట మరిపించడానికి డాక్టరును మాటల్లోకి దంచాడు

"ఒక్కరోజుకే ఎందుకండీ ఈ నిమ్మకాయలు, యెనిమా గొట్టాలు డాక్టరుగారూ. మీకు జైలు అనుభవం లేనట్లున్నది." తన కా అనుభవం

లేదని సూటిగా వొప్పేసుకున్నాడు డాక్టరు. ఈ ప్రత్యేక రాష్ట్ర ఆందోళనలోనైనా జైలుకెళ్ళి దేశభక్తుడు కావాలని ఉబలాటపడ్తున్నాడు. కాని ప్రాక్టీసు దెబ్బతింటుందేమోనని భయపడ్తున్నారు. కాని ఇలా జైలుకెళ్ళితే రాజకీయ బాధితుడు అన్న పేరొస్తుందో రాదో అని అనుమానంలో పడి వెనక ముందాడ్తున్నారు. కొందరి యీ మనోభావాన్ని కనిపెట్టినట్లున్నాడు వెంకయ్యగారు.

"ఇదివరకున్న రాజకీయ బాధితులతోనే చచ్చిపోతున్నాం, కొత్త రాజకీయ బాధితులను గుర్తించవద్దని మొదటికి మొదలే ప్రకటన చేశాడు. ప్రత్యేక రాష్ట్ర ఆందోళనలో కొత్త రాజకీయ బాధితులు పుట్టుకొస్తారేమో నని భయపడ్డాడు పాపం. హరిజన మైనారిటీ వెనకబడిన జాతుల "లీగ్" అధ్యక్షుడు వెంకయ్యగారు. ఈ వెంకయ్యగారికీ, డాక్టరుగారికీ రాజకీయ గురువు ననుకుంటాడు కిష్టయ్యగారు. అప్పుడప్పుడు తాము నడిపే హాస్టలు విద్యార్థుల గొడవల్లో కిష్టయ్యగారినికూడా సలహాలు అడుగుతూ వుంటాడు.

కిష్టయ్యగారంటే మా ఊళ్లో చాలా పాత రాజకీయ బాధితుడు. నిరాహారదీక్షల ఎక్స్పర్టు. ఎవరే ఆందోళన తలపెట్టినా దాన్ని బల పరుస్తూ బస్సుస్టాండులో ఆమరణ నిరాహారదీక్షకు సర్వదా తయారుగా వుంటాడు. బస్సుస్టాండులోనే యెందుకయ్యా నిరాహారదీక్ష అంటే, అందరూ చూడాలి, ఆకాశవాణిలో రావాలి గనక అంటారు గిట్టనివాళ్లు. ఆయన్ను కదిలిస్తే చాలు, పెద్దపెద్ద నాయకులతో తనకున్న సావాసాలూ, జైళ్ళల్లో తన ఆమరణ నిరాహార దీక్షలూ వాటి అనుభవాలూ విసుగు విరామంలేకుండా గంటలకొద్దిగా చెప్తాడు. లేచి పోదామనుకున్నా పోనీయ కుండా లాగి కూర్చోబెడ్తాడు. అన్నట్టు ఇది విన్నావా అని తన ఊతపదం నిముష నిముషానికి వాడుతూ చెప్పుకుపోతాడు.

"ఎదుటివాణ్ణి అనడానికి అంతా వొంటికాలుమీద లేస్తారు గాని ప్రతివానికీ ఒక ఊతపదం వుంటుంది. నోర్మూయవోయ్, పిచ్చినాయనా" అంటారు యెవరైనా ఎగతాళి చేస్తే.

తనకున్న రాజకీయ జీవితానికి కనీసం మున్సిపల్ మెంబర్ గిరీ అయినా ఇప్పించని నాయకుల కృతఘ్నతను దినానికి పదిసార్లయినా శపించనిదే వదలడు. పదవులో ఉన్నవాళ్లు వాళ్ళు ఇద్దరు గట్టని కాలం సంగతులు చెప్పి వాళ్ళ నిజాంమీది భక్తినీ, తెల్లవాడిమీది రక్తినీ కడిగిపోస్తారు.

నీ వాగుడే నీ కపకారం చేస్తున్నదని కొందరు చెప్పాక కొంత, కొంత లౌక్యం అన్నది యీమధ్యనే వంటబట్టించుకుంటున్నాడు — అందుకే ఉపవాసాల క్యాంపు ఆదాయంలో ఇంతో అంతో గిట్టుబాటైందన్న ప్రతీతి. గోరంచు ధోతులున్నండి ఎం.ఎల్.ఏ. అంచు ధోతీ జరీ కండువాకు ప్రమోషన్ సంపాయించుకున్నాడు కిష్టయ్యగారు. సాగర్ క్రింద దొరికిన రాజకీయ మాన్యంలో సత్వంత వ్యవసాయం కూడా పెట్టుకున్నాడు.

ఇంత ఉత్సాహం వెల్లివిరుస్తున్నా చిన్నబుచ్చుకున్నది కిష్టయ్యగారి స్నేహితుడు రంగయ్య గారొక్కడే.

ముప్పూటలా తినంది ఉండలేడు గనుక ఉపవాసాలు చెయ్యలేడు గాని ఉపన్యాసాలు మాత్రం ఇవ్వగలడు. అపశబ్ద భయం నాస్తిగా, ప్రతివాది భయంకరంగా ఉపన్యాసం దంచెయ్యగలడు. అందుకే అన్నీ కని పెట్టిన వెంకటేశ్వర్లు ఉపవాస శిబిరానికి ప్రారంభోపన్యాసకుడుగా రంగయ్యపేరు వేయించాడు. రంగయ్యగారి ప్రతాపరుద్రసేన వాలంటీర్లను జడ్.పి. చేర్మన్‌గారి చాళుక్యసేన వాలంటీర్లతోబాటు దీక్షపరుల్లో కూచోబెట్టాడు, పంచాయతీ ప్రెసిడెంటుగారి పల్లవసేన, ఎమ్. ఎల్. ఏ. గారి శాలివాహన సేన, మున్సిపల్ చేర్మన్‌గారి రాచకొండ సేన, ఎం.పి. గారి కొండవీటి సేనలనుగూడా తానే దగ్గరవుండి ఏ పక్షపాతం లేకుండా, పంచాయితీలు రాకుండా అన్ని యేర్పాట్లూ చేయించాడు. కాని జడ్. పి.

చేర్మన్‌గారు అంతా తలక్రిందులు చేశాడు. ఉపవాసం వుండడానికే గాని ఉపన్యాసాలు యివ్వడానికి కావు యీ క్యాంపులు అని ప్రారంభోపన్యాసం అన్న ఎజండాలోని ఐటంను కొట్టిపారేశాడు. చేతనైతే ఉపవాసం చేయ మన్నాడు ఉపన్యాస కేసరిని. ఉపన్యాసా లేమీ లేకుండా జడ్.పి. చేర్మన్, పంచాయితీ సమితి చేర్మన్, ఎం.ఎల్ ఏ. ఎం.పి. గార్లతో సహా తెర వెళ్ళారు. జై తెలంగాణా, జై ఆంధ్రా అంటూ ఉపవాస దీక్షితులుగా ఆసనాలను అలంకరించారు పూలదండలేశారు. ఫోటోగ్రాఫర్లు క్యామరా అను 'క్లిక్' మనిపించారు అందరి ఫోటోలూ పడ్డాయో లేదోనని ఇంకో షాట్ తీరారు. ఫోటోలో పడనివాడు తను ప్రాణం తీయకుండా ఎవడి జాగ్రత్త వాడు పడ్డాడు. పబ్లిక్ రిలేషన్సువాళ్ళు ఈ వార్తను ఆకాశవాణికి, పత్రికలకు స్పెషల్ జీపులో పంపించారు. పత్రికల వ్యాన్‌వాళ్ళను కూడా హెచ్చరించారు. రేపు ఈ వార్త తాటికాయలంత అక్షరాలతో మొదటి పేజీలో వచ్చేటట్టు చేస్తామన్నారు వాళ్ళు. పాపం యిదివరకే వాళ్ళవి రెండు వ్యాన్‌లను అగ్నిహోత్రుడు ఉదయం టిఫిన్ ఇడ్లీ సాంబార్‌లా కాజేశాడు.

ఉపన్యాసాలంటూ వుంటే, కొట్లాడైనా, హుకంగొట్టయినా రంగయ్య గారు వేదికనెక్కి తిడతాడు కనుక ఆ అవకాశం లేకుండా చేశారు జడ్.పి. చేర్మన్‌గారు. అందరినీ సమైక్యపరచాల్సిన అవశ్యకతను వెంకటేశ్వర్లు చెవిలో యిల్లుగట్టుకొని చెప్పినా లాభం లేకపోయింది. పైగా ప్రతాపరుద్ర సేనవాళ్ళను చేరదీసినందుకు చీవాట్లుకూడా వేశాడు. ప్రతాపరుద్రుడు విశాలాంధ్ర వాది అని చరిత్రలో వుందని తెలుగు మాష్టారు చెప్పారుట. అందుకోసం ప్రతాపరుద్రసేన సమైక్యసేన అవుతుంది. సెపరేటిస్టుసేన కానేకాదు. కాకూడదు, అని రూలింగిచ్చారు జడ్,పి, చేర్మన్‌గారు. ఎం. పి. గారు, ఎం, ఎల్. ఏ. గారంతా డిటో అన్నారు. పూర్వం సమైక్యతమీద ఉపన్యాసమిచ్చినట్లు సెపరేషన్ పైన బ్రహ్మాండం బద్దలయ్యే

టట్లుగా ఉపన్యాసం పేనుకొచ్చిన ఉపన్యాస కేసరి రంగయ్యగారికి నిజంగానే చెప్పలేనంత నిరాశా నిస్పృహలు ఎదురయ్యాయి. శివుడు కాలకూటాన్ని మింగినట్లుగా ఆవేశాన్ని దిగమింగారు. చివరికీ సభవారికో చిన్న రిక్వెస్టు చేశాడు.

"నా కవకాశం యిస్తే ప్రతాపరుద్రుడు పక్కా సెపరేటిస్టు అని రుజువు చేస్తాను. నా సేన తప్ప తక్కిన సేనలన్నీ వేర్పాటు వాదానికి వ్యతిరేక చిహ్నాలు. ప్రతాపరుద్రుడే గదరా నాయనా కాకతీయ సామ్రాజ్యాన్ని ముక్కచెక్కలు చేసింది. మలిక్కాఫూర్ వచ్చిం దెప్పుడూ, చైర్మన్‌గారికి చరిత్ర చెప్పాల్సింది తెలుగు మాస్టరా, అయ్యో, దేశమా నీకెంత కర్మ పట్టింది అక్కటక్కటా" అనే రాజువేషం పోజులో సభవారిముందు దోసిలొగ్గి నిల్చున్నారు.

"పూర్వం చెప్పిన హాశికథలు జ్ఞాపకం వస్తున్నాయి, వచ్చేస్తున్నాయి ఉపన్యాస కేసరికి, లాగండిరా పీణ్ణి వెనక్కు" అన్నారు ఎమ్మెల్యేగారు.

"లక్షలు ఖర్చుపెట్టి ఎమ్మెల్యేలు, ఎం. పి. లు అయ్యారు. వీరికి ఉపన్యాసం ఇవ్వొస్తుందా పాడా? జీత భత్యాలు తినడమే తప్ప ఒక్కనాడైనా పల్లెత్తి మాట్లాడిన పాపాన పోలేకదా, జడ్. పి. చెయిర్మన్ రాసుకొని చదువుతాడు, పంచాయతీ సమితి ప్రెసిడెంటు తరఫున బి. డి ఓ మాట్లాడతాడు. మునిసిపల్ ఛైర్మన్ ముద్దమొద్దుకు మారురూపం. ఉపన్యాసాలు ఇవ్వరావడం పూర్వ జన్మ సుకృతం, వెధవాయలకేం తెలుస్తుంది." రౌద్రాకారంతో అనర్గళంగా సమాసాలకు సమాసాలు, కామాలు ఫుల్ స్టాపులు లేకుండా మాటలు వదిలాడు.

"నీ తలకాయ తిరుగుతున్నది, కోడి మెడ విరిచినట్లు విరిచేస్తా దొంగనాకొడకా-అని జడ్. పి. చైర్మన్‌గారి సేన ఉపన్యాస కేసరి మీదికి లంఘించింది.

"నీ డొక్క చీల్చి డోలు కడతాం." అని ఎమ్మెల్యేగారి సేన ఉపన్యాస కేసరిని ఘెరావు చేసింది.

"కిందటిసారి సమైక్యత అని, ఇవాళ ప్రత్యేకత అంటున్నాడు లుచ్ఛాగాడు" అని అష్టోత్తర శతం వడ్డించింది మున్సిపల్ చైర్మన్ ముఠా.

"మంత్రి పదవి ఖాయంచేసుకోవడానికి సెపరేట్ అంటున్నాడు. వీణి మనలోకి చేరనీయవద్దంటే మీరెవరూ నా మాట వినలేదు" అని మున్సిపాలిటీ చెయిర్మన్ చేతులు పైకిలాగి యుద్ధానికి లేచాడు.

ఎం. పి గారు ఆయన్నిలాగి కూర్చోబెట్టారు.

"మనం నోరుచేసుకోగూడదు. చేయి చేసుకోగూడదు. ఆ పని చేయాల్సిన వాళ్ళు వేరే వున్నారు. అనవసరంగా ఎందుకయ్యా తొందర పడతావు" అని ఎమ్మెల్యేగారు నెమ్మదిగా చెప్పి కూచోబెట్టాడు.

"నీకేంతెలుసోయ్"వంక్షాయపులుసు అనిఎం పి గారినిఎమ్మెల్లేగారిని పడదోసి ముందుకెళ్లాడు, మున్సిపాలిటీ చెయిర్మన్. ఎమ్మెల్యేగారు ఎం పీ మీద పడ్డారు. లేవదీయడానికి పంచాయతీ సమితి ప్రెసిడెంటు భారీదేహు డైన ఎమ్మెల్యే గారిని లాగుతున్నారు. వెంకటేశ్వర్లు అందరినీ, శాంతి శాంతి అని చేతులు జోడించి బ్రతిమిలాడుతున్నాడు. పంచాయతీ సమితి ప్రెసిడెంటు లాగుడుకు ఎమ్మెల్యే గారి ఖద్దరు టెర్లిన్ చొక్కా చిరిగి పోయింది. ఎం. పి గారి ఖద్దరు టెరికాట్ లాల్చీకూడా చిరిగింది.

"పాత పగ సాధించుతున్నాడు రోయ్ పంచాయతీ సమితి ప్రెసి డెంటు"అని ఎం. పి. ఎమ్మెల్యే గార్లు యిద్దరూ గోలకెత్తారు. సమితి ప్రెసిడెంటుగానైనాగెలవకపోతానా అని ఎం, పి. సీటుకూ. ఎమ్మెల్యే సీటుకూ పోటీచేసి వోడిపోయాడు. సమితి ప్రెసిడెంటు పదవి మటుకు ఖాయంగా వుండిపోయింది.

"ఏదైనా ప్రశాంతంగానూ, అహింసా యుతంగానూ జరగాలి. సమైక్యతా వాదులముందు పలచనయ్యే పని మనం చేయరాదు" అన్న కిష్టయ్యగారి కేకలు యెవరూ వినిపించుకోలేదు.

పెద్దమనుషులు ఆవేశంలోవున్నారు. చేతులుచేతులుకలిసాయి. మున్సిపల్ చెయిర్మన్ ఎమ్మెల్యే. ఎం. పి. సమితి ప్రెసిడెంటుగారి సైన్యాలు తమ నాయకుల రక్షణకు కదిలాయి. ఆత్మరక్షణతోపాటు శత్రువుపై దాడి కూడా చేస్తే తట్టు కొట్టు సిద్ధాంతం ఆచరణలో కొస్తుంది. అలాగే జరిగింది. అంతఃపుర కల్లోలం అంతర్యుద్ధంగా పరిణమించింది. ఎం. పి, గరి ముఠావాళ్ళ దుకాణాలను ఎం. ఎల్. ఏ. గారి ముఠా, వీళ్ళిద్దరి శిష్యవర్గం దుకాణాల సామాన్లను, మున్సిపలీ చైర్మన్ ముఠా యెత్తుకుపోయింది, పరస్పరం ఆదిలో బదిలీలు జరిగాయి. బస్‌స్టాండుకు యిరువైపులావున్న దుకాణాలు పాత పగలకాహుతైనాయి. యేతగాదా పడని పచ్చజండా వళ్ళ దుకాణా కూడా పంచ బంగాళమైనాయి, తమతోపాటు రెండు ఆర్. టి. సి బస్సులనుగూడ అగ్నిదేవుడికి ఆహారంగా సమర్పించాయి. శిబిరం అంతర్యుద్ధ శిబిరంగా మారింది, దక్షయజ్ఞం జరిగిన దానికన్నా యెక్కువ బీభత్సమె జరిగింది.

జడ్, పి' చైర్మన్‌గారు ఫోన్‌చేసినా పోలీసులు రానేలేదు. అల నాటు ప్రకారం అంతా అయ్యాక పంచనామా కోసం వచ్చారు. పాలక వర్గంలో తగాదా, రేపెవరు అధికారంలో కొస్తారో యేమో సెపరేషన్ అయితే తాము దేశభక్తులపైన దొంగ కేసులు పెట్టి సతాయించామని కక్ష సాధిస్తే యెవడు దిక్కు. కరవమంటే కప్పకు కోపం. విడవమంటే పాముకుకోపం' ప్రదేశంమీద వుండకపోవడమే ప్రత్యేక రక్షణ అనుకున్నారు పోలీసులు, అధికార్లూ రెవెన్యూ వాళ్ళూ-అంతే చేశారు,

వెంకటేశ్వర్లుకు యజ్ఞంచేసినంత పనయింది. "బ్రదర్! రాజకీయ

నాయకులంతా రసాభాసచేశారు, వేర్పాటుకోసం సాధించిన సమైక్యతనంతా చట్టుబండలుచేశారు. వాళ్ళ పాత పగలు ఒక్కనాటితో ఎలాపోతాయి." అని నోరూ, నొసలూ బాదుకున్నారు. ఏదేమైనా తన యూరియా పంపకం పెక్షన్‌చేజారిపోకుండా వుండడానికి కావలసిన పుణ్యం అంతా సంపాయించుకున్నాడు, అదొక్కటే మిగిలిపోయిన సంతృప్తి.